


నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, ఆదివారం 7 ఏప్రిల్ 2024 | HYDERABAD









- కోదండాపూర్ '132 కేవీ'లో సాంకేతిక సమస్య
- సుమారు ఆరు గంటల పాటు నిలిచిన కృష్ణా జలాల సరఫరా
- నీటి సమస్యతో అల్లాడుతున్న నగరంపై ప్రభావం పడే అవకాశం
- సుమారు 60-70 మిలియన్ గ్యాలన్ల లోటు ఏర్పడినట్లు అంచనా
- పూర్తయిన మరమ్మతు పనులు..
- సాయంత్రానికి జలాల తరలింపు సాధారణ స్థితికి..

మూలిగే నక్కపై..

# మంటలు రేగి.. సప్లై ఆగి

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): మూలిగే నక్కపై తాటిపండు పడిందంటే ఇదేనేమో. ఒకవైపు సుర్రుమంటున్న ఎండలతో భారీగా పెరిగిన నీటి వినియోగం... మరోవైపు పెద్ద ఎత్తున ఒట్టిపోయిన బోర్లు... వెరసి హైదరాబాద్ మహా నగరంలో తాగునీటి సరఫరా డిమాండుకు అనుగుణంగా లేదనేది అక్షర సత్యం. ఈ నేపథ్యంలో నగరానికి కృష్ణా జలాల సరఫరా వ్యవస్థలో అత్యంత కీలకమైన కోదండాపూర్ నీటి శుద్ధి కేంద్రంలోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. వాస్తవానికి ఇంతటి ఉష్ణోగ్రతల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లలో సమస్య తలెత్తడం సహజమైనప్పటికీ... 24 గంటల పాటు నగరానికి నిరంతరంగా మూడు పైపులైన్లలో నీళ్లు వస్తున్నా.. సరిపోవడం లేదు.. అలాంటిది ఏకంగా ఆరు గంటల పాటు అంతరాయం కలగడమంటే సరఫరా వ్యవస్థ గాడి తప్పుతుంది. రిజర్వాయర్లలో ఉన్న నీటి నిల్వలతో శనివారం ఆ ప్రభావం పెద్దగా కనిపించనప్పటికీ ఆది, సోమవారాల్లో మాత్రం నగరవ్యాప్తంగా మంచినీటి సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఎదురుకానున్నట్లు తెలుస్తున్నది. సమస్య మరింత జటిలం కాకుండా జలమండలి అధికారులు స్థానిక నాయకులతో కలిసి చర్యలు తీసుకుంటున్నారు.

### రోజుకు 270 మిలియన్ గ్యాలన్లు..

మహా నగరంలో మంచినీటి సరఫరా కోసం జలమండలి ఐదు నీటి వనరుల ద్వారా రోజుకు సుమారు 560 మిలియన్ గ్యాలన్ల జలాల సరఫరా జరుగుతున్నది. అందులో కృష్ణా నది నుంచి రోజుకు 270 మిలియన్ గ్యాలన్లు అంటే దాదాపు 48 శాతం వరకు వస్తున్నాయి. అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకొని... కోదండాపూర్ వద్ద ఉన్న నీటి శుద్ధి కేంద్రంతో పాటు మరో మూడు దశల్లో శుద్ధి కేంద్రాల్లో కూడా శుద్ధి చేసి నగరానికి మంచి నీటిని తరలిస్తున్నారు. కోదండాపూర్ ప్లాంటు నుంచి మూడు పైపులైన్ల ద్వారా జలాల తరలింపు జరుగుతున్నది. అయితే అత్యంత కీలకమైన కోదండాపూర్ ప్లాంటులోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం ఉదయం సుమారు ఆరు గంటలకు సాంకేతిక సమస్య తలెత్తింది. పొటెన్షియల్ ట్రాన్స్‌ఫార్మర్ బస్, ఐసోలేటర్ విఫలమైంది.



మంటలు వచ్చాయి. దీంతో నీటి పంపింగ్‌కు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా మూడు పైపులైన్లలో నగరానికి పంపింగ్ ఆగిపోయింది. అప్రమత్తమైన అధికారులు మరమ్మతు పనులు ప్రారంభించగా మధ్యాహ్నం 12 గంటల వరకు పూర్తయినట్లు సీజీఎం దశరథరెడ్డి తెలిపారు. అయితే మధ్యాహ్నం 2 గంటలకు పంపింగ్ మొదలైనట్లు సమాచారం. 6 గంటల పాటు నగరానికి సరఫరా నిలిచిపోవడంతో దాదాపు 60-70 మిలియన్ గ్యాలన్ల కొరత ఏర్పడినట్లు అంచనా. ఇది ఒకరోజు నగరానికి అందాల్సిన కృష్ణా జలాల్లో 22-25 శాతం వరకు ఉంటుంది. కాగా, సాయంత్రం వరకు జలాల తరలింపు సాధారణ స్థితికి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

### ▪ నేడు, రేపు సరఫరాపై తీవ్ర ప్రభావం..

ఎండ తీవ్రత పెరుగుతుండటంతో నగరంలో నీటి వినియోగం భారీగా పెరుగుతున్నది. దీనికి తోడు మహా నగరవ్యాప్తంగా వేలాది బోర్లు ఎండిపోయాయి. ప్రజలు జలమండలి సరఫరా చేసే నీటితో పాటు ప్రైవేటు ట్యాంకర్లపైనే ఆధారపడుతున్నారు. రోజు విడిచి రోజు జరిగే నీటి సరఫరా ఇప్పుడు ప్రాంతాల వారీగా 3-5 రోజులకోసారి జరుగుతున్నది. డిమాండు పెరిగిన దృష్ట్యా మునుపటికంటే తక్కువ సమయానికే సరఫరాను పరిమితం చేశారు. ప్రజలు ఎంత పొదుపుగా నీటిని వాడుకుంటున్నప్పటికీ అవసరాలు తీరడం లేదు. ఈ క్రమంలో కృష్ణా జలాల సరఫరాకు అంతరాయం కలగడం ఆందోళన కలిగించే విషయం. శనివారం సమస్య తలెత్తినప్పటికీ... ఉదయం ఆరు గంటల వరకు జరిగిన నీటి సరఫరాతో రిజర్వాయర్లలో నిల్వలు ఉన్నాయి. ఆ నీటినే సరఫరా చేశారు. అయితే ఆరు గంటల పాటు సరఫరా నిలిచిపోవడంతో సాయంత్రం నుంచి అనేక ప్రాంతాలకు నీటి సరఫరా జరగలేదు. ఆది, సోమవారాల్లో కూడా నీటి సరఫరాపై తీవ్ర ప్రభావం ఉండే అవకాశాలున్నట్లు తెలుస్తున్నది.



సమావేశంలో మాట్లాడుతున్న సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ చిత్రంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

## కాంగ్రెస్ హామీలు అమలు చేయకపోతే ▸ నిలదీస్తాం

### సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్

బేగంపేట్, ఏప్రిల్ 6: కాంగ్రెస్ చెప్పిన పథకాలను అమలు చేయకపోతే ప్రజా క్షేత్రంలో నిలదీస్తామని సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ అన్నారు. శనివారం సికింద్రాబాద్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో సనత్‌నగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ ఇటీవల శాసనసభ ఎన్నికల్లో గెలిచిన విధంగానే పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, నగరంలో నీటి, కరెంటు కొరత బాగా పెరిగిపోయిందని చెప్పారు. కేసీఆర్ జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడు రైతులు కాంగ్రెస్ ప్రభుత్వంపై కోపంగా ఉన్నారన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేసి.. పద్మారావుగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, కొలన్‌బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మైలార్‌దేవ్‌పల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

## అవకాశవాద రంజిత్‌రెడ్డిని చిత్తుగా ఓడిద్దాం

### ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ/మైలార్‌దేవ్‌పల్లి: బీఆర్ఎస్‌ను మోసం చేసిన రంజిత్‌రెడ్డిని పార్లమెంటు ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కేవీఎంఆర్ ప్రైడ్ గార్డెన్స్‌లో శనివారం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం శక్తివంచన లేకుండా పోరాటం చేసి స్వరాష్ట్రాన్ని సాధించి పెట్టిన కేసీఆర్‌కు వెన్నంటే ఉంటూ.. చేవెళ్ల గడ్డపై గులాబీ జెండాను ఎగురవేసి ఆయనకు బహుమానంగా అందించాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను గడపగడపకు వివరించడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ బుట్టదాఖలైన విషయాలను ప్రజలకు బీఆర్ఎస్ శ్రేణులు తెలియజేసి..ఓట్లను అభ్యర్థించాలని కోరారు. కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు బీఆర్ఎస్ శ్రేణులు పనిచేయాలన్నారు. ఈనెల 13న చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన నిర్వహించే భారీ బహిరంగ సభకు భారీ ఎత్తున జనసమీకరణ చేపట్టాలని శ్రేణులను కోరారు. అలాగే మైలార్‌దేవ్‌పల్లిలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ రోజు రోజుకు మరింత బలం పుంజుకుంటుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖ యాదగిరి, వైస్ చైర్మన్ వెంకటేశ్ యాదవ్, మాజీ ఎంపీపీ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌ను గెలిపించుకుందాం

### నిజాంపేట్ సమావేశంలో ఎమ్మెల్యే వివేకానంద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్, చిత్రంలో ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

దుండిగల్, ఏప్రిల్ 6: మల్కాజిగిరి పార్లమెంటరీ స్థానం పొలిటికల్ నిరుద్యోగులకు అడ్డాగా మారిందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శనివారం ప్రగతినగర్‌లోని శ్రీకృష్ణాగార్డెన్స్‌లో నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వాకలపూడి రంగరాయప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశానికి మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడిచిన పదేండ్ల కాలంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి.. బీఆర్ఎస్‌కు ఓటువేసేలా ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత కార్యకర్తలు, నేతలపైనే ఉందన్నారు. స్థానికుడు రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించుకునేందుకు ఇంటింటికీ తిరిగి ప్రచారాన్ని ముమ్మరం చేయాలని సూచించారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు స్థానికులను కాకుండా ఎక్కడి నుంచో అభ్యర్థులను తీసుకొచ్చి ఇక్కడ పోటీకి పెట్టారని, వారు ఎప్పుడు అందుబాటులో ఉండరనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు కూలుతుందో ఎవరికీ తెలియదన్నారు. సమావేశంలో నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజుయాదవ్, కార్పొరేటర్లు మేకల వెంకటేశం, బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ తెచ్చిన కష్టం

సిటీబ్యూరో: తుక్కుగూడలో శనివారం జరిగిన కాంగ్రెస్ సభకు ఆర్టీసీ బస్సులను ఉపయోగించుకోవడంతో నగర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ఇప్పటికే తక్కువ సర్వీసులతో బస్సులు నడుస్తుంటే ఉన్న వాటిని కాంగ్రెస్ సభకు తరలించడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఎండలో గంటల తరబడి బస్సుల కోసం ఎదురుచూడాల్సి వచ్చింది.





## కళ్యాణ్‌లో అందాల ఆభరణం..

ముద్దుగుమ్మ 'గుంటూరు కారం' ఫేం మీనాక్షి చౌదరి శుక్రవారం నగరంలో సందడి చేసింది. ఉగాది పండుగ సందర్భంగా పంజాగుట్టలోని కళ్యాణ్ జువెల్లర్స్‌లో ఏర్పాటు చేసిన ఆభరణాల ప్రదర్శనను ప్రారంభించింది. వివిధ నగలను ప్రదర్శించి.. ఫొటోలకు పోజులిస్తూ.. హొయలుపోయింది. **- ఖైరతాబాద్, ఏప్రిల్ 6**

## మళ్లీ కన్నీటి కష్టాలు

### కేపీహెచ్‌బీ కాలనీలో తాగునీటికి తండ్లాట

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 6 : కేపీహెచ్‌బీ కాలనీలో తాగునీటి కోసం ప్రజల తండ్లాట మొదలైంది. కేసీఆర్ పాలనలో ఇంటింటికీ సమృద్ధిగా తాగునీటిని సరఫరా చేయడంతో.. పదేండ్లుగా ఖాళీ బిందెలతో ప్రదర్శనలు కనుమరుగయ్యాయి. అర్హులైన వారికి 20వేల లీటర్ల తాగునీటిని ఉచితంగా సరఫరా చేయడంతో పాటు ప్రజల అవసరాలకు తగ్గట్టుగా నీటిని అందించారు. దీంతో మహిళలు తాగునీటి కోసం ఎదురుచూసే అవసరమే లేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలే అయ్యింది. అప్పుడే ప్రజలకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. గత కాంగ్రెస్ పాలనలో కనిపించిన ఖాళీ బిందెల ప్రదర్శనలు మళ్లీ పునరావృతమవుతున్నాయి. కేపీహెచ్‌బీ కాలనీ 3వ రోడ్డులోని ఈడబ్ల్యూఎస్ గృహాల్లో మూడ్రోజులుగా తాగునీరు సరఫరా చేయకపోవడంతో స్థానికులు తల్లడిల్లుతున్నారు. మూడ్రోజుల కిందట నిర్దేశిత సమయం ప్రకారం కాకుండా కొద్ది సమయమే నీటిని సరఫరా చేశారు. ఇదేమని అడిగితే పైనుంచి నీటి సరఫరా తక్కువగా ఉందని మరుసటిరోజు సరిపడా వస్తాయని చెప్పడంతో ప్రజలు ఎదురుచూశారు. తీరా శనివారం నీటి సరఫరా చేసినప్పటికీ పట్టుమని పది నిమిషాలు కూడా రాకపోవడంతో ప్రజలంతా ఆందోళన చెందారు. సమీపంలోని వాటర్ ట్యాంకర్ వద్దకు వెళ్లి అధికారులను నిలదీశారు. కాలనీ ప్రజలకు సరిపడా నీళ్లు రాలేదని అదనంగా మరికొద్దిసేపు సరఫరా చేయాలని ఆందోళనకు దిగారు. వాటర్ ట్యాంకర్లతో నీటిని విక్రయిస్తుండగా అడ్డుకున్నారు. స్థానికులకు నీరు ఇచ్చిన తర్వాతే బుకింగ్ చేసుకున్న వారికి సరఫరా చేయాలని బైఠాయించారు. రంగంలోకి దిగిన జలమండలి అధికారులు.. నీటిని సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో వెనుదిరిగారు.



కేపీహెచ్‌బీ కాలనీలో జలమండలి వాటర్ ట్యాంకర్ వద్ద ఆందోళన చేస్తున్న ప్రజలు